క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గార్ల: తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.78,000 నగదు, ఒక సెల్‌ఫోన్ దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన గార్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రం అంబేడ్కర్ నగర్‌లోని మార్గదర్శి ప్రైవేటు పాఠశాల హెచ్‌ఎం చిట్టిబాబు ఈనెల 15న ఇంటికి తాళం వేసి బంధువుల పెళ్లికి వెళ్లాడు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో బీరువాలోని రూ.78వేల నగదు, యాంప్లిఫైర్, 2 సౌండ్‌బాక్స్‌లు, ఒక సెల్‌ఫోన్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై ఎస్‌డి మైబూబి వెల్లడించారు.

ఆరు తులాల బంగారం..

కొత్తగూడ: ఇంట్లో ఎవరు లేని సమయం చూసి సుమారు ఆరు తులాల బంగారం చోరీ చేసిన సంఘటన మండలంలోని చెరువుముందు తండాలో సోమవారం వెలుగు చూసింది. గూడూరు సీఐ సూర్యప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బదావత్ రంగమ్మ తన కోడలికి సంబంధించిన బంగారు నగలు బీరువాలో దాచారు. ఆస్పత్రిలో ఉన్న బంధువులను చూడడానికి ఆదివారం రంగమ్మ హడావుడిగా వెళ్లింది. సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఎలా ఉన్న తలుపులు అలాగే ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు నగలు మాత్రం కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ సూర్యప్రకాష్, ఎస్సై కుశకుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న తునికాకు డీసీఎం సీజ్

కొత్తగూడ: అనుమతులు లేకుండా తరలిస్తున్న తునికాకు డీసీఎంను అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పూనుగొండ్ల యూనిట్ తునికాకును కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిన కల్లాల నుంచి డీసీఎంలో లోడ్ చేసి ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు యత్నించాడు. కొందరు వ్యక్తులు డీఎఫ్ఓ కు సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ రంగంలోకి దిగి డీసీఎంను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఆకు విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని ఎఫ్‌డీఓ తెలిపారు.

పాకాల ఏటిలో పడిపోయిన ట్రాక్టర్ ట్రక్కు

గార్ల: గార్ల నుంచి గొల్లచెర్ల గ్రామానికి ట్రాక్టర్ ద్వారా సిమెంట్ ఇటుకలు తీసుకెళ్తుండగా పాకాల ఏటి వద్ద ఎత్తుగడ్డ ఎక్కలేక నాబి ఊడిపోవడంతో ట్రాక్టర్ వెనుకభాగం ట్రక్కు పాకాల ఏటిలో పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. సంఘటనా స్థలాన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు సందర్శించాడు. పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఇలాంటి సంఘటనలను నివారించవచ్చన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని తూర్పుతండాకు చెందిన అజ్మీర రామచంద్ సోమవారం ఆవును మేత కోసం తీసుకెళ్లాడు. అక్కడ పడి ఉన్న విద్యుత్ తీగకు ఆవు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు విలపించాడు.

చికిత్స పొందుతున్న ఆఫీస్ సబార్డినేట్ మృతి

కురవి: చికిత్సపొందుతూ కురవి తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న రాజోలు గ్రామానికి చెందిన బొడ్డు రాంబాబు(40) సోమవారం మృతి చెందినట్లు కురవి పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత 15వ తేదీన కురవి శివారులోని 365/ఏ ఖమ్మం జాతీయ రహదారిపై ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదుట లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో రాజోలు గ్రామానికి చెందిన బొడ్డు రాంబాబుకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాంబాబు మృతి చెందినట్లు పీఎస్సై తెలిపారు. మృతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సన్మానం



మరిపెడ రూరల్: జాగృతి మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా మహబూబాబాద్ మండలంలోని చిల్లంచర్ల గ్రామానికి మారిపల్లి మాధవిని ఇటీవల జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల ప్రకటించింది. ఈ సందర్భంగా మాధవిని గ్రామ డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఓఏల మండల అధ్యక్షుడు రాంపెల్లి వెంకన్న, కొండూరు వెంకన్న, నాగంజాచారి, జాగృతి నాయకులు గంధసిరి వేణు, నాగిరెడ్డి, దోమల సోమయ్య, ఉపేందర్, సిరాజ్, మురళీ పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

- వర్షాలు పడితే తడుస్తున్న పుస్తకాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం

నెల్లికుదురు: ఎన్నో ఏళ్ల నుంచి ఎంతో మందిని ప్రయోజకులను చేసి, ఎంతో మందికి విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న గ్రంథాలయ కార్యాలయం ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుని, నీడకోసం ఎదురు చూస్తోంది. అందులో ఉన్న జ్ఞాన సంపద సుమారు వివిధ రకాల 6వేల పుస్తకాలను తడవకుండా కాపాడుకోవడానికి గ్రంథాల శాఖ అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న గ్రంథాలయం 1986లో నిర్మించారు. సుమారు 40ఏళ్ల క్రితం మట్టితో గోడలు, సిమెంటు రేకులతో రెండు చిన్న గదులతో మొదలైంది. వర్షాలు పడితే చాలు మట్టి గోడలు నాని పుస్తకాలు తడుస్తున్నాయి. గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గ్రంథాలయంలో సుమారు 6వేల వరకు ఉన్న పుస్తకాలతో గ్రూప్–1 నుంచి వివిధ రకాల కాంపిటిషన్ పోటీ పరీక్షలకు అవసర పడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గ్రంథాలయంలో రోజు సుమారు 100 మంది సందర్శకులు, 300మంది సభ్యులు ఉండి ఇంత జ్ఞాన నిధిని కాపాడుకోలేక పోవడం దారుణమని పాఠకులు ఆవేదన చెందుతున్నారు. గ్రంథాలయంలో కనీసం పది మంది కూర్చోలేని పరిస్థితి ఉందని, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక దుర్భర పరిస్థితిలో కొనసాగుతుంది. ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, కలెక్టర్ స్పందించి శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం పరిశీలించి, నూతన భవన నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన గ్రంథాలయం నిర్మించాలి



విజ్ఞానాన్ని పెంపొందించడం కోసం నిర్మించిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. గ్రంథాలయంలో కూర్చోవడానికి వీలు లేకుండా ఉంది. కనీసం పుస్తకాలు తడువకుండా కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు స్పందించి నూతన గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– పెరుమాండ్ల బాబు గౌడ్, నెల్లికుదురు

పుస్తకాలు కాపాడుకోలేకపోతున్నాం..



గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, వర్షాలు పడితే పుస్తకాలు తడిసిపోతున్నాయి. రేకులను కోతులు ధ్వంసం చేయడంతో పుస్తకాలను కాపాడుకోడం ఇబ్బందిగా ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో సందర్శకులకు అనుగుణంగా నూతన గ్రంథాయల నిర్మాణానికి స్థలం కేటాయించాలి.

– అభిషేక్, గ్రంథాలయ అధికారి

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: కాంగ్రెస్‌లో కష్టపడి పని చేస్తే గుర్తింపు వస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, జిల్లా పరిశీలకులు రవళిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని వారితో కలిసి ప్రసంగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ సత్తా చాటాలని, ప్రతి కార్యకర్త గెలుపు కోసం సైనికుల్లా కృషి చేయాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దవంగర మండలాన్ని అభివృద్ధి చేసి చూపుతానని, గత ప్రభుత్వం అలసత్వంతో నూతన కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. మండల అభివృద్ధిపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జాటోతు నెహ్రూ నాయక్, నెమరుగోమ్ముల ప్రవీణ్ రావు, శైలారావు, మురళి గౌడ్, హరికృష్ణ గోపాల్ నాయక్, పూర్ణచందర్, సైదులు, సతీష్, ఎండీ జాను పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి

నెల్లికుదురు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.600 కూలి చెల్లించాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని రామన్నగూడెం ఉపాధిహామీ పనుల వద్ద సోమవారం కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీలకు వేతనం అందించాలన్నారు. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో అశోద యాకూబ్, నర్సయ్య, మల్లయ్య, సోమక్క పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

కురవి: ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అన్నారు. సోమవారం సీరోలు మండల కేంద్రంతోపాటు కాంపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈనెల 30వ తేదీన ఉపాధి చట్టం రక్షణ కోసం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నెల్లికుదురు: మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ప్రగతి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై శివరామకృష్ణ, నాయకుడు వెంకటేశ్వర్లు, ప్రగతి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జాను పాల్గొన్నారు.

నీటిని పాలేరుకు తరలించడం అన్యాయం



ధర్నా చేస్తున్న నాయకులు

గార్ల: కాంగ్రెస్ ప్రభుత్వం మున్నేరు నీటిని పాలేరు రిజర్వాయర్‌కు తరలించడం అన్యాయమని గోదావరి జనసాధన సమితి చైర్మన్ జంపాల విశ్వ అన్నారు. జీఓ నంబర్ 98ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సోమవారం గార్లలో అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గార్ల పాకాల ఏటిపై 50 ఏళ్లుగా పాలిస్తున్న ప్రభుత్వాలు మున్నేరు ప్రాజెక్ట్‌ను పెండింగ్‌లో పెట్టి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. మున్నేరు ప్రాజెక్ట్‌ను జీఓలకు, సర్వేలకు పరిమితం చేసి ఏజెన్సీ ప్రాంతాలకు సాగు, తాగునీరు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కార్యక్రమంలో సక్రు, భద్రయ్య, వెంకన్న, నాగరాజు, మురళీ, రాములు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మహబూబాబాద్: మానుకోట మండలం జంగిలిగొండ గ్రామంలో వడ్డెర కులస్తుల కోసం కొన్ని సంవత్సరాల క్రితం గ్రామంలో నాలుగు ఎకరాల భూమి కేటాయించి పట్టాలు ఇచ్చిందని, కాని స్థలాల కేటాయింపు చేయలేదని వడ్డెర సంఘం బాధితులు శివరాత్రి మల్లయ్య, వెంకన్న, సోమయ్య, కృష్ణ, ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామంలో నాలుగు ఎకరాల స్థలం కేయించి 124మందికి 120గజాల చొప్పున స్థలం కేటాయించిందన్నారు. స్థలం చదును కోసం మూడు లక్షలకు పైగా ఖర్చు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లేని ఎడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాకమ్మ, రేణుక, వెంకటమ్మ, పార్వతమ్మ, సరస్వతి, ధనమ్మ, స్వరూప పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్న ప్రతిభను చూపాలి



గూడూరు: బహుమతులు అందజేస్తున్న డీఈఓ

గూడూరు: వేసవి శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న తమ ప్రతిభను చూపాలని డీఈఓ రవిందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో డీఈఓతో పాటు జీఈసీఓ విజయకుమారి హాజరయ్యారు. సమ్మర్ క్యాంపులో నైపుణ్యం చూపిన బాలికలకు బహుమతులు అంజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతుల సోమవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు ముదిగిరి సదయ్య, లక్ష్మీకుమారి, సురేష్, పీఈటీ మధు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు నేర్చుకున్న ప్రతి విషయాన్ని పునశ్చరణ చేసుకోవాలని కంబాలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జి.ఉప్పలయ్య అన్నారు. వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, శిభారాణి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, కవిత పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా..



నుజ్జునుజ్జయిన కారు

మహబూబాబాద్ రూరల్: కారు అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఐదుగురికి స్వల్పగాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో గల అటవీశాఖ అర్బన్ పార్క్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామం వైపు నుంచి ఓ కారులో ఐదుగురు యువకులు బాలాజీ, సురేష్, సాయి, అశోక్, మోహన్ వస్తున్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో గల అటవీశాఖ అర్బన్ పార్క్ వద్దకు కారు చేరుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి ఒక్కసారిగా ఆ పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు యువకులకు స్వల్ప గాయాలుకాగా గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కారు నుజ్జునుజ్జు అయింది.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్: బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్



దోర్నకల్: తహసీల్దార్ ఇమ్మానియల్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహబూబాబాద్: మానుకోట తహసీల్దార్‌గా చంద్ర రాజేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మానుకోట తహసీల్దార్‌గా పని చేసిన భగవాన్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం బదిలీ అయ్యారు.

దోర్నకల్ తహసీల్దార్‌గా ఇమ్మానియల్..

దోర్నకల్: దోర్నకల్ తహసీల్దార్‌గా ఇమ్మానియల్ సోమవారం విధుల్లో చేరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌తో పాటు నాయకులు తహసీల్దార్‌ను సన్మానించారు.

కురవి విజయ.. సీరోలు పున్నంచందర్..

కురవి: సీరోలు మండల తహసీల్దార్‌గా పున్నంచందర్, కురవి తహసీల్దార్‌గా విజయ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బయ్యారం నాగరాజు

బయ్యారం: బయ్యారం తహసీల్దార్‌గా ఎస్.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా బయ్యారం తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.విజయను కురవి తహసీల్దార్‌గా బదిలీ చేసి ఆ స్థానంలో నర్సింహులపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగరాజును నియమించారు.

మరిపెడ కృష్ణవేణి

మరిపెడ: మరిపెడ తహసీల్దార్‌గా కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ సైదులు ఖమ్మం జిల్లా అర్బన్‌కు బదిలీ అయ్యారు.

గూడూరు నాగ భవాణి

గూడూరు: గూడూరు తహసీల్దార్‌గా నాగభవాని సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

నెల్లికుదురు సీహెచ్.నరేష్

నెల్లికుదురు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ నరేష్ నెల్లికుదురుకు బదిలీపై వచ్చారు.

కేసముద్రం వివేక్

కేసముద్రం: కేసముద్రం తహసీల్దార్‌గా వివేక్ సోమవారం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. సంఘాల నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న జి.నాగయ్య



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



కురవి: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మరిపెడ రూరల్: గుండెపుడి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో రక్తదానం..

జిల్లా వ్యాప్తంగా సోమవారం దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. జీవితాంతం బడుగు బలహీనవర్గాలు, వ్యవసాయ కూలీలు, కార్మికుల కోసం నిత్యం పోరాటాలు చేశారని గుర్తు చేశాడు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

కార్మికులకు మద్దతుగా సీపీఐ పోరాటం

నెహ్రూసెంటర్: ఆర్టీసీ కార్మికులకు మద్దతు సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని చేపట్టిన ఉద్యమంలో పార్టీ నేతలపై పెట్టిన కేసుల్లో భాగంగా సోమవారం కోర్టు హాజరయ్యారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, ఎండి. ఫాతిమా పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

బయ్యారం: పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన హత్యలపై సమగ్రమైన ఉన్నతస్థాయి విచారణ చేపట్టి నిందుతులపై కఠిన చర్య తీసుకోవాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య సోమవారం డిమాండ్ చేశాడు. నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ల మురళీకృష్ణ, యాకయ్య, నాగేశ్వరరావు, పద్మ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కురవి: రాజోలు గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ వీరబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సుధాకర్, మల్సూర్, కృష్ణయ్య, జ్యోతిబసు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

కేసముద్రం: రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేసి, నకిలీ విత్తనాలను అరికట్టాలంటూ కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో తహసీల్దార్‌లకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో నాయకులు కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, యాకుబ్‌పాష, వెంకన్న, వెంకటేష్, బానోత్ సూరజ్, సమ్మక్క పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఒంటరి మహిళ అయిన గుర్రం శకుంతల తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పక్షవాతంతో కాళ్లు పని చేయడం లేదని, తనకు ఎవ్వరూ లేరని ఒంటరి మహిళ అని కూడా చూడకుండా మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లు జాబితా నుంచి పేరు తొలగించారన్నారు.

కూలిన ప్రహరీ

కురవి: మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలోని మేఘ్యాతండాలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ సోమవారం కూలిపోయింది. పాఠశాల హెచ్‌ఎం అడ్డగోడ నరేష్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కూలిన గోడ విషయమై ఎంఈఓకు వివరించారు.

25శాతం సీట్లు కేటాయించాలి

నెల్లికుదురు: రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలల్లో 25శాతం సీట్లు కేటాయించి నిరుపేద విద్యార్థులకు ఉచితంగా చదువు అందించాలని పేదల రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు గిరిగాని భిక్షపతి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు.

చర్య తీసుకోవాలి

దంతాలపల్లి: గ్రామాలలో తిరుగుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సాయిలు, భిక్షపతి, యాకుబ్, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కామెపల్లి మండలం బర్లగూడెంకు చెందిన బానోత్ రమేశ్ ఆదివారం రాత్రి బొడ్రాయితండా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తూ చిలుకోడు సమీపంలో తోపుడు బండిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

కురవి: మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మండల స్పెషల్ అధికారి నరసింహరావు, తహసీల్దార్ విజయ పరిశీలించారు. 4300 బస్తాల ధాన్యం కాంటా అయి కేంద్రంలో ఉన్నాయని, లారీలు రావడంలేదని అధికారులకు నిర్వాహకులు వివరించారు.

కొనసాగుతున్న విచారణ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం గ్రామ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవన జ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం లేకుండానే అక్రమంగా ట్రక్ షీట్లు పొందడంపై మూడో రోజు సోమవారం విచారణ కొనసాగింది.

శాంతి చర్చలు జరపాలి

కేసముద్రం: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపి వేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలంటూ మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొట్టం అంజయ్య, బొమ్మగాని వెంకన్న, బట్టమేకల రాజు, దాసరి స్వరూప, జల్లె సైదులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు

గూడూరు: దైవ చింతనతో ప్రతి ఒక్క కుటుంబం ఆనందకరమైన జీవితంతో సంతోషంగా ఉంటారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని దుబ్బగూడెంలో బొడ్రాయి వేడుకలకు సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ హాజరై పూజలు చేశారు.

నేటినుంచి బొడ్రాయి వేడుకలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు భగ్గుతండాలో శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ప్రారంభంకానున్నాయని 9వ వార్డు మాజీ కౌన్సిలర్ హరిసింగ్ సోమవారం తెలిపాడు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మరిపెడ రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కొర్రీలు పెట్టకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చుయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం మండలం నీలికుర్తి గ్రామ శాఖ సమావేశంలో మాట్లాడారు. అనంతరం నీలికుర్తి కార్యదర్శి అనపర్తి సత్యంతో పాటు ఐదుగురి కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బాలకృష్ణ, రషీద్, వెంకన్న, మల్లేష్, శ్రీను, రవి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు తొలగించాలి

కేసముద్రం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, నాయకులు బొబ్బాల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.